క్లుప్తంగా

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న పెన్మత్స చిట్టిరాజు తదితరులు

ఐ.పోలవరం: మండలంలోని పల్లిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం దేవదాయ ధర్మాదాయ శాఖ, మురమళ్ల వీరేశ్వర స్వామి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం జరిగింది. నాట్య వేద కూచిపూడి అకాడమీ దివాకర్ శిష్య బృందం చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పాల్గొని నృత్య ప్రదర్శన తిలకించారు. అనంతరం చిన్నారులకు దేవస్థానం తరఫున స్వామివారి చిత్రపటాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వీరేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, పెన్మత్స చిట్టిరాజు, బి.వీరభద్రరావు, నాగాభట్ల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి జాతీయ వర్క్‌షాప్

యానాం: యానాం సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమీనార్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌ఏఓ మునిస్వామి, అన్నవరం సత్యవతి దేవి(ఏఎస్‌డీ)మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనంత లక్ష్మి పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఉద్యోగ వేటలో భాగంగా ఇంగ్లిష్ భాషను చక్కగా మాట్లాడటం, అర్థం చేసుకోవడం, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై అవగాహన కలిగించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలని తెలిపారు.

9న లోక్ అదాలత్

ముమ్మిడివరం: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రెహంతుల్లా పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మనోవర్తి, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనాథ బాలలకు వితరణ



ఫ్యాన్లు, నిత్యావసర సరకులు అందజేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

అమలాపురం టౌన్: కెనరా బ్యాంక్ 118వ ఫౌండర్స్ డే సందర్భంగా శనివారం స్థానిక శ్రీకామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరానికి ఫ్యాన్లు, నిత్యావసర సరకులు వితరణగా ఇచ్చారు. బ్యాంకు అధికారులు పీఠాన్ని సందర్శించి నిత్యావసరాలను ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణికి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచి చీఫ్ మేనేజర్ కె.స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సమీక్ష



వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకు నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై శనివారం స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో ఆర్‌ఏఓ మునిస్వామి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు రూపొందించిన ప్రచార వాహనాలు విస్తృత ప్రచారం నిమిత్తం వచ్చే నెలలో యానాం రానున్న నేపథ్యంలో ముందుస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ రవిశంకర్, విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు, మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ


తాళ్లరేవు: వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఇటీవల పటవల పంచాయతీ కొత్తూరులో జరిగిన మత్స్యకారుల ఆత్మీయ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన గంగాధర్ అదుపు తప్పి పడిపోవడంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. ఈ నేపథ్యంలో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గంగాధర్‌ను ఎమ్మెల్యే పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దొరబాబు, నాగేంద్రప్రసాద్, వెంకటరమణ, నాగరాజు తదితరులున్నారు.

వన విహారానికి వేళాయె..

- కార్తిక వన సమారాధనలకు కోరంగి అభయారణ్యంలో ఏర్పాట్లు
- ప్రకృతి అందాల నడుమ బోటు షికార్



కోరంగి అభయారణ్యం వద్ద పర్యాటకుల సందడి



పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే చెక్క వంతెన

తాళ్లరేవు: పవిత్ర కార్తికం ప్రారంభమైంది.. ఈ మాసంలో కొంత మంది దైవారాధనలు చేస్తే.. మరి కొంతమంది ఆలయ సందర్శనలతో పాటు.. ఆహ్లాదాన్ని పంచే విహార యాత్రలకు.. ముఖ్యంగా వన విహారానికి ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుత కార్తికంలో రేపే మొదటి ఆదివారం. దీంతో పలువురు పిక్నిక్‌లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సామూహిక వన సమారాధనలకు కోరంగి అభయారణ్యం ముస్తాబైంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ప్రకృతి ఒడిలో ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు వేదిక కాబోతోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఏటా అనేక మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చి సామూహిక వనసమారాధన కార్యక్రమాల్లో పాల్గొంటారు. కోరంగి అభయారణ్యంలో కలియతిరుగుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతుంటారు. ముఖ్యంగా మడ అడవుల్లో చెక్క వంతెనలపై నడుస్తూ, పక్షుల కిలకిలా రావాలు, వృక్షాల సౌందర్యం, పలు జంతువుల విన్యాసాలను తిలకిస్తూ పరవశించిపోతుంటారు. వాచ్ టవర్, బోట్లపై నుంచి మడ అడవుల అందాలు, సముద్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతారు. కార్తిక మాసంలో అభయారణ్యంలో గడపడం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఈ మేరకు పర్యటకుల సౌకర్యార్థం తాగునీరు, తినుబండారాల దుకాణాలను అటవీ శాఖ ఏర్పాటు చేసింది.

ప్రత్యేక ఆకర్షణగా అక్వేరియం

అభయారణ్యం ప్రాంతంలో సంచరించే మత్స్య జాతులను పర్యాటకులకు చూపించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన అక్వేరియం ప్రత్యేక ఆకర్షణ కానుంది. దీంతో పాటు మడ అడవుల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు చిన్న డాక్యుమెంటరీని రూపొందించి వీడియో థియేటర్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల పక్షులను టూరిస్టులు చూసేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని మరో రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున తెలిపారు.



కోరంగి అభయారణ్యంలో పర్యాటకుల బోటు షికారు

అలరించనున్న బోటు షికార్

అభయారణ్యంలో పర్యాటకులకు బోటు షికార్ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. మడ అడవుల్లో ఉండే క్రీకు(పిల్ల కాలువలు)లను పర్యాటకులు సందర్శించే విధంగా బోట్లపై క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. బోటుపై విహరిస్తూ అభయారణ్యం అందాలను ఆస్వాదించడం మరచిపోలేని అనుభూతినిస్తుంది.

ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు



అభయారణ్యాన్ని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకుల్లో అధిక శాతం మంది బోటు షికారు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేశాం. లైఫ్ జాకెట్ వేసుకున్నవారిని మాత్రమే బోటు షికారుకు అనుమతిస్తాం. పోర్టు అధికారుల అనుమతులు, నిబంధనల మేరకు ఒక డ్రైవర్, ఒక సేఫ్టీ గార్డ్ బోటులో ఉంటారు.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, కోరంగి అభయారణ్యం

ఆహార పదార్థాలను అనుమతించడం లేదు



పర్యాటకులు తమ వెంట తెచ్చుకునే ఆహార పదార్థాలను అభయారణ్యంలోకి అనుమతించడం లేదు. అభయారణ్యం ప్రవేశ ద్వారం బయట ఉన్న ఖాళీ స్థలంలో గాని, లేక పక్కనే ఉన్న రిసార్ట్స్‌లో గాని ఆహారాన్ని భుజించవచ్చు. అభయారణ్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, కాలుష్య నియంత్రణ, వన్యప్రాణుల సంరక్షణ కోసమే ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం.

– ఎం.నాగార్జున, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పశువుల్లంకలో మత్స్యకారుల ఆత్మీయ సదస్సు



పశువుల్లంక సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ఐ.పోలవరం: కోస్తా తీరం వెంబడి చమురు సంస్థలు ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి నష్ట పరిహారం తీసుకొస్తున్నామని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పశువుల్లంక మెండిలో నిర్వహించిన మత్స్యకార ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓఎన్‌జీసీ నష్ట పరిహారానికి సంబంధించి ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికీ రూ.69 వేల చొప్పున ఈ నెల 21న బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు మాటలు తప్ప చేతలు చేయలేకపోయారని, వచ్చిన నిధులు వెనక్కి తీసుకెళ్లిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలు పడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ పరిహారాన్ని తీసుకొచ్చామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ నఖిలే పెద్దిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ధూళిపూడి చక్రం, ఢిల్లీ నారాయణ, కాటం సత్తిరాజు, పెమ్మాడి బాబూరావు, ఏలూరి ఆదినారాయణ, భూపతిరాజు బులిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ప్రభుత్వం



గొల్లవిల్లిలో వలంటీర్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్

ఉప్పలగుప్తం: క్రీడాకారులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై మండలంలోని వలంటీర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి ఆడుదాం ఆంధ్రలో నమోదు చేయించేలా వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఈ నెల 20 నుంచి ప్రతీ సచివాలయం స్థాయిలో జరిగే వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో ఆటలకు ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. గ్రామ స్థాయిలో వచ్చే నెల 15 నుంచి 20 వరకూ, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకూ, నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి 19 వరకూ, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 20 వరకూ క్రీడా పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లంకా రాణి, మండల పరిషత్ ఏఓ ఎం.నరసింహమూర్తి, ఎంఎస్‌డీఓ కె.మధుసూధనరావు, పీడీలు సరస్వతి, విఘ్నేశ్వరుడు, ప్రసాద్, విజయ్ భాస్కర్, సీతాపతిలు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాను విజయవంతం చేయాలి



కోరంగిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్

తాళ్లరేవు: ఈ నెల 21వ తేదీన ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరంగిలో నిర్వహించే మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకార భరోసా కార్యక్రమం సన్నాహక ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిషోర్ మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధించి తాగునీరు, వైద్యం, ఆహార పంపిణీ, విద్యుత్, పారిశుద్ధ్యం పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాలుగు నియోజకవర్గాల నుంచి లబ్ధిదారులు పాల్గొంటున్న నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మత్స్యకార భరోసా కార్యక్రమం కోసం కోరంగి కనకదుర్గ ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటుచేస్తున్న సభా ప్రాంగణాన్ని మండల అధికారులతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, మత్స్యశాఖ అధికారులు సత్యనారాయణ, కరుణాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి టి.మారుతీరావు, కోరంగి ఎస్ఐ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఎ.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మహమ్మద్ ఉన్నీషా

అల్లవరం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే మహమ్మద్ ఉన్నీషా అన్నారు. భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గోడి బాలికల గురుకులంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు వయసు నిండకుండా పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతీఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, విజయలక్ష్మి, దేవి, కనకమహాలక్ష్మి, మాధూరి తదితరులు పాల్గొన్నారు.

మేధస్సును పెంచే విద్యా నిలయాలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాట్రేనికోన: గ్రంథాలయాలు విజ్ఞానం, వినోదంతో పాటు మనిషి మేధస్సును పెంచే విద్యా నిలయాలని శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వీ పరమేశ్వరరావు అన్నారు. మండలంలో చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కందికుప్ప గ్రంథాలయం అధికారి తులసిలక్ష్మి ఆధ్వర్యంలో కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు, తెలుగు ఉపాధ్యాయులు బాబా, డ్రాయింగ్ టీచర్ దుర్గాభవాని పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: జాతీయ గ్రంథాయల వారోత్సవాల్లో భాగంగా శనివారం వన్నెచింతలపూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు స్కూల్ హెచ్‌ఎం గుబ్బల నాగా సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బడుగు సత్యనారాయణ, టీవీవీ సుబ్రహ్మణ్యం, శ్రీప్రకాష్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లి విజయలక్ష్మి, బి.శారద, డి.సీతారత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.2,500 కోట్లు వెచ్చించామని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ స్వగృహంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహణకు సంబంధించి పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు పార్టీలు కలిసి పోటీచేస్తున్నా ప్రజల మద్దతు మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ఉంటుందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో తనకు సీటు రాదని కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని, వ్యక్తుల కన్నా పార్టీ ముఖ్యమన్నారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండలంలో త్వరలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దన రావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, రేవు మల్లీశ్వరి, దున్నా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాడి రూ.లక్ష విరాళం

యానాం: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కొల్హాపూర్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో నిలిచి బర్రెలక్కగా సోషల్‌మీడియాలో విస్తృత ప్రాచుర్యాన్ని సంపాదించిన శిరీషకు మద్దతుగా రూ.లక్ష విరాళాన్ని ఇస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన శిరీషకు ఫోన్ ద్వారా విరాళం గురించి తెలియజేశారు. సేవ చేసేవారే ప్రజాప్రతినిధులుగా గెలవాలన్నది తన లక్ష్యమని అందుకే శిరీష లాంటి వారికి మద్దతుగా నిలుస్తున్నానని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం: మండలంలోని వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని భార్య లక్ష్మికి వాడపర్రు అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు శనివారం రూ.14,200 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, సేవా సమితి సభ్యులు గుత్తాల సుభాష్ చంద్రబోస్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, నాగరాజు, ముళ్ల రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో మహాలింగార్చన

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని విలసవిల్లిలో బసవయ్య అగ్రహారం రామాలయం వద్ద కార్తిక మాసం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. పండితుడు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్తిక పంచమి సందర్భంగా శనివారం పుట్ట మట్టితో 365 శివలింగాలను ఏర్పాటు చేసి శివలింగాకారాన్ని రూపొందించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్నకు ఉయ్యాల సేవ

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం ప్రతీ శనివారం రాత్రి స్వామికి ఉయ్యాల సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి తెలిపారు. స్వామికి ప్రీతిపాత్రమైన శనివారం తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. కార్తిక మాసం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారికి పూర్ణాభిషేకం, తులసీ పూజ, అమ్మవార్లకు కుంకుమార్చన, వేంకటేశ్వర హోమం తదితర పూజాదికాలు చేశారు. స్వామి వారి ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం: మండల పరిధి మునిపల్లిలో పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శివాలయంలో పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి నిమ్మకాయల మహోదర రుత్విక్, నాగ సత్యలక్ష్మీ దంపతులచే శనివారం ఘనంగా లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. కొమానపల్లి కాశీవిశ్వనాథశర్మ ఆధ్వర్యంలో మహాలింగాభిషేకం, లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కాట్రేనికోన: మండలంలోని నడవపల్లిలో ఉమరామలింగేశ్వరస్వామికి శనివారం భక్తుల ఆర్థిక సహాయంతో లక్ష బిల్వార్చన, కుంకుమ అర్చన నిర్వహించారు. విశాఖపట్టణానికి చెందిన బోడెం నారాయణ దంపతులు రామలింగేశ్వరస్వామికి రజత లింగం తొడుగు, అమ్మవారికి మంగళ సూత్రాలను అందజేశారు.

రేషన్ వాహనాలపై ప్రధాని స్టిక్కర్ ముద్రించాలి

అమలాపురం రూరల్: రేషన్ పంపిణీ వాహనాలపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్టిక్కర్ ముద్రించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యంకు భారతీయ జనతా యువ మోర్చా కోనసీమ జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్ వినతి పత్రం శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఇళ్ల సత్యనారాయణ, యల్లమెల్లి నాగసుధ పాల్గొన్నారు.

పాత రైల్వే లైన్‌నే కొనసాగించాలి



ఎంపీ అనురాధకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

అల్లవరం: కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ నిర్మాణం కోసం 15 ఏళ్ల క్రితం ప్రకటించిన అలైన్‌మెంట్‌ని మార్చి కొత్త అలైన్‌మెంట్‌ని ప్రతిపాదించారని, దీని వల్ల తాము తీవ్రంగా నష్టపోతామంటూ బోడసకుర్రు గ్రామానికి చెందిన రైతులు ఎంపీ అనురాధని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. కొత్తగా ప్రతిపాదించిన రైల్వే లైన్‌ను రద్దు చేసి పాత రైల్వే లైన్‌నే కొనసాగించాలని ఎంపీని కోరారు. ఇప్పటికే జాతీయ రహదారికి పొలాలు ఇచ్చామని, కొత్త రైల్వే లైన్ అలైన్‌మెంట్ అమలైతే మరోసారి నష్టపోతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు అవరా చంటి, దొమ్మేటి శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు సత్కారం

తాళ్లరేవు: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లను తాళ్లరేవు మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు దడాల సాల్మన్‌రాజ్ శ్రీనివాసరావు గజమాలతో సత్కరించారు. తాళ్లరేవు క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో తాళ్లరేవు మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన సాల్మన్‌రాజును ఎమ్మెల్యే పొన్నాడ అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాలుర ఖోఖో పోటీలు



యానాంలో జరిగిన ఖోఖో పోటీల్లో క్రీడాకారులు

యానాం: జోనల్ గేమ్స్‌లో భాగంగా శనివారం స్థానిక ఎంజీబీటీ హైస్కూల్‌లో అండర్-14 బాలుర ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో పరంపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం సాధించగా రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు అభినందించారు. కార్యక్రమంలో జోనల్ గేమ్స్ కన్వీనర్ పాలికి శివప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అమలాపురం టౌన్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, బండి వెంకటలక్ష్మి, బేబీ గంగారత్నం పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా సర్వేకు ప్రభుత్వ నిర్ణయం

యానాం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లోని భూములను కేంద్ర సర్వే శాఖ సహాయంతో డ్రోన్ ద్వారా సమగ్రంగా సర్వే చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని సర్వే చేయడానికి రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ ల్యాండ్ సర్వేస్, కేంద్ర సర్వే శాఖ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. యానాంలో ఉన్న 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో ప్రాంతాన్ని డ్రోన్ సహాయంతో సర్వే చేయనున్నారు. నాలుగు రీజియన్లలోని 129 రెవెన్యూ విలేజ్‌లను సర్వే చేసి డ్రోన్ మాపింగ్ ద్వారా 2డీ మ్యాప్‌లను రూపొందించనున్నారు.

24 నుంచి సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహించిన పోలీస్ డ్రైవర్ పోస్టులకు ఎంపికైన వారికి ఈ నెల 24 నుంచి సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి ఎతుమలై శనివారం తెలిపారు.

లేగ దూడల ప్రదర్శన



విజేతలుగా నిలిచిన రైతులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కాట్రేనికోన: మండలంలోని దొంతికుర్రులో శనివారం పాడి రైతులు లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పాడి రైతులు లేగ దూడలను సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఏడాది వయసున్న హెచ్‌ఎఫ్, జెర్సీ, గిరి జాతి ఆవులకు చెందిన 34 లేగ దూడలతో రైతులు ఉత్సాహంగా ప్రదర్శన చేశారు. అనంతరం విజేతలుగా నిలిచిన పాడి రైతులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దాడి ఈశ్వరి, ఎంపీటీసీ రేవు ఈశ్వరి, పశు సంవర్ధక శాఖ సహాయకులు డి.సాయికుమార్, ఏడీలు నాగేశ్వరరావు, ఎల్.విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.